రీడింగ్ రూములేవీ..?

- జిల్లాకు 30 మంజూరు...
- ఆరింటిని ప్రారంభించి పట్టించుకోని అధికారులు
- రెండేళ్లుగా అటకెక్కిన ప్రతిపాదనలు
- గ్రామాల్లో ఏర్పాటు చేయాలన్న యువత

కథలాపూర్: ప్రతీ వ్యక్తికి జ్ఞానాన్ని అందించడం, పఠనాశక్తి, ఏకాగ్రత స్థాయి పెంచడంలో గ్రంథాలయాలు కీలకపాత్ర పోషిస్తాయి. గ్రంథాలయాల్లో అందుబాటులో ఉన్న పుస్తకాలు పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న నిరుద్యోగులకు ఎంతో ఉపయోగపడుతాయి. గ్రామీణ ప్రాంతాల్లో గ్రంథాలయాలు లేకపోవడంతో పట్టణ ప్రాంతాలు, మండల కేంద్రాలకు పాఠకులు వెళ్లాల్సిన పరిస్థితి. 2023లో తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా 'పబ్లిక్ రీడింగ్ రూం'లు పేరుతో గ్రామాలకు మినీ గ్రంథాలయాలు మంజూరు చేయగా.. వాటిని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లోనే ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. జిల్లాకు అప్పట్లో 30 పబ్లిక్ రీడింగ్ రూంలు మంజూరు కాగా, ఆరింటిని ప్రారంభించారు. మిగతా గ్రామపంచాయతీల్లో స్థలం లేదని స్థానిక అధికారులు తెలపడంతో ప్రతిపాదన అటకెక్కినట్లయింది.



మినీ గ్రంథాలయం ఏర్పాటుకు ప్రతిపాదించిన ఊటుపల్లి గ్రామ పంచాయతీ

జిల్లా గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహణ..

కొత్తగా పబ్లిక్ రీడింగ్ రూంలను జిల్లా గ్రంథాలయ ఆధ్వర్యంలో నిర్వహించి, భవనంలో వసతులు, ఫర్నీచర్ కోసం పరిస్థితులను బట్టి రూ. 2.50 లక్షల వరకు వెచ్చిస్తామని అధికారులు తెలిపారు. ఒక్కో పబ్లిక్ రీడింగ్ రూం కోసం నెలకు రూ. 2 వేలు చొప్పున నిధులు కేటాయించగా.. రూ. 1,000 తో పుస్తకాలు, న్యూస్‌పేపర్లు కొనుగోలు చేయాలి. మరో రూ.1,000 నిర్వహించేవారికి గౌరవ వేతనంగా ఇవ్వాలి. దీని కోసం గ్రామపంచాయతీలో ప్రత్యేకంగా గది కేటాయించాలనేది ప్రభుత్వ నిబంధన. ఇదంతా బాగానే ఉన్నా.. జిల్లాకు 30 పబ్లిక్ రీడింగ్ రూంలు మంజూరైతే అప్పట్లో ఆరింటిని ప్రారంభించారు. మిగతా 24 పబ్లిక్ రీడింగ్ రూంలలు రెండేళ్లుగా ప్రారంభించ లేదని విద్యావంతులు అంటున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

చదువుకునే వీలుంటుంది



గ్రామాల్లో గ్రంథాలయం ఉంటే ఎప్పటికప్పుడు కొత్త పుస్తకాలు అందుబాటులో ఉంటాయి. యువతకు, విద్యార్థులకు వీలైనప్పుడు చదువుకునే వీలుంటుంది. గ్రామీణ ప్రాంతాల్లో నిరుద్యోగులు పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యేందుకు పట్టణ ప్రాంతాలకు వెళ్లే భారం తప్పుతుంది. ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ చూపి మండలంలో పబ్లిక్ రీడింగ్ రూములు ఏర్పాటు చేయాలి.

– గుగ్లోత్ రవి, భూషణరావుపేట

పాలకులు చర్యలు తీసుకోవాలి



గ్రామాల్లో యువత పుస్తకాలు చదువుకునేందుకు వీలుగా గ్రంథాలయాలు ఏర్పాటు చేయాలి. అక్షరాస్యత శాతం పెరిగినప్పుడు.. చదువుకున్నవారిని ప్రోత్సహించేలా ప్రతీ గ్రామంలో గ్రంథాలయం ఏర్పాటు చేస్తే కొత్త విషయాలు తెలుసుకుంటారు. గ్రంథాలయాలుంటే పోటీ పరీక్షల కోసం సలహాలు, సూచనలు తీసుకునే వీలుంటుంది. పాలకులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలి.

– గాంధారి శ్రీనివాస్, న్యాయవాది, సిరికొండ

వసతులు సమకూర్చితే ఏర్పాటు

పబ్లిక్ రీడింగ్ రూముల ఏర్పాటుకు అనువుగా ఉండే గ్రామపంచాయతీలు, ఇతర భవనాలుంటే నివేదికలు ఇస్తే పరిశీలించి ఏర్పాటు చేసేందుకు సిద్ధం. జిల్లాకు 30 పబ్లిక్ రీడింగ్ రూములు మంజూరు కాగా, గ్రామపంచాయతీలు వసతులు కల్పించిన ఆరు గ్రామాల్లో ఏర్పాటు చేసి ప్రారంభించాం. మిగతా మండలాల్లోనూ వసతులుండి నివేదిక ఇస్తే శాఖపరంగా ఏర్పాటు చేస్తాం.

– సరిత, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి, జగిత్యాల

క్లుప్తంగా

తైబజార్‌ను రద్దు చేయాలని కమిషనర్‌కు వినతి


కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

రాయికల్: పట్టణంలో తైబజార్‌ను రద్దు చేయాలని పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో మున్సిపల్ కమిషనర్ మనోహర్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మ్యాకల రమేశ్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తైబజార్‌ను రద్దు చేసి రైతులకు ఎంతో మేలు చేశారని, అదే విధంగా రాయికల్‌లో కూడా తైబజార్‌ను రద్దు చేయాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎద్దండి భూంరెడ్డి, నియోజకవర్గ యూత్ కన్వీనర్ కొయ్యేడి మహిపాల్‌రెడ్డి, హనుమాన్ ఆలయ కమిటీ చైర్మన్ దాసరి గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

కాలం చెల్లిన పదార్థాలు విక్రయిస్తే చర్యలు


జరిమానా విధిస్తున్న సురేశ్

రాయికల్: పట్టణంలో కాలం చెల్లిన పదార్థాలు విక్రయించవద్దని, విక్రయిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురేశ్ హెచ్చరించారు. పట్టణంలోని ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, హోటల్స్, దుకాణాలను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కాలం చెల్లిన కూల్‌డ్రింక్స్ అమ్మిన స్వీట్ హౌస్ ఓనర్‌కు జరిమానా విధించారు. ఆయన వెంట జవాన్ సుదర్శన్, సిబ్బంది ఉన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

పెగడపల్లి: వేసవి కాలంలో పశువులకు సంక్రమించే సీజనల్ వ్యాధులపై రైతులకు అవగాహన కల్పించాలని పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ నరేశ్ సిబ్బందికి సూచించారు. మండల కేంద్రంలోని పశువైద్య కేంద్రాన్ని బుధవారం సందర్శించారు. సీజనల్ వ్యాధుల నివారణపై గ్రామాల్లో వ్యాక్సినేషన్ చేపట్టాలన్నారు. కార్యక్రమంలో పశువైద్యాధికారి హేమలత, సిబ్బంది పాల్గొన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి


వివరాలు సేకరిస్తున్న సంక్షేమాధికారి నరేశ్

పెగడపల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు, లబ్ధిదారులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా సంక్షేమాధికారి నరేశ్ సూచించారు. పెగడపల్లి మండలంలోని రాములపల్లి అంగన్‌వాడీ కేంద్రాన్ని మల్యాల సీడీపీవో వీరలక్ష్మితో కలిసి తనిఖీ చేశారు. ఈ కేంద్రం ద్వారా అందించే సరుకులు, పౌష్టికాహారం పంపిణీ సక్రమంగా చేపట్టడం లేదని కొందరు లబ్ధిదారులు ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు సుభద్ర, పవిత్ర, ఇన్‌చార్జి అంగన్‌వాడీ టీచర్ శారద పాల్గొన్నారు.

చివరి పంటలకు సాగు నీరందించేందుకు చర్యలు


లచ్చనాయక్‌తండా వద్ద కాల్వలో చెట్లను తొలగిస్తున్న లస్కర్లు

సారంగాపూర్: మండలంలోని రేచపల్లి, బట్టపల్లి, పోతారం సారంగాపూర్, గ్రామాల్లోని రైతుల పంట పొలాలకు ఎస్సారెస్పీ సాగునీరు సాఫీగా అందేవిధంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఎస్సారెస్పీ డీఈ చక్రూనాయక్ తెలిపారు. బుధవారం మండలంలోని లచ్చునాయక్ తండా సమీపంలోని డీ–53,12ఎల్,1ఆర్ కాలువను లస్కర్ల ద్వారా చెత్త, ముళ్లపొదలు, చెట్లను తొలగించి కాలువను శుభ్రం చేసే పనులను చేపట్టగా వాటిని పరిశీలించారు. మరో రెండు తడులు ఎస్సారెస్పీ నీటిని విడుదల చేస్తారని ప్రతి నీటి బొట్టు చివరి భూముల వరకు చేరే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఏఈ అనిల్, సూపర్‌వైజర్ మోహన్, లస్కర్లు ఉన్నారు.

ఆర్టీఏ కార్యాలయానికి స్థలం కేటాయించాలి

జగిత్యాలరూరల్: జగిత్యాల జిల్లా కేంద్రంలోని జిల్లా రవాణా శాఖ కార్యాలయం నిర్మాణానికి అనువైన ప్రభుత్వ స్థలం కేటాయించాలని ఆర్టీఏ మెంబర్ కమటాల శ్రీనివాస్ బుధవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో 10 ఎకరాల స్థలాన్ని చూసి జిల్లా రవాణా శాఖ కార్యాలయానికి అప్పగించాలని, ప్రస్తుతం తాటిపల్లిలోని రవాణా శాఖ కార్యాలయంలో చాలా మంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. జిల్లా కేంద్రంలో అనువైన స్థలాన్ని గుర్తించి రవాణా శాఖ కార్యాలయ ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు.

ఎమ్మెల్యేను కలిసిన మహిళలు

జగిత్యాల రూరల్ మండలం అన్నపూర్ణ సమైక్య అధ్యక్షురాలిగా ఎన్నికైన మారు సత్తవ్వ, అర్బన్ మండలం అక్షర సమైక్య అధ్యక్షురాలిగా ఎన్నికైన గంగ భవానీలు బుధవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.


ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న శ్రీనివాస్

మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్టు

జగిత్యాలరూరల్: సీఎంను కలిసి వినతిపత్రం అందజేసేందుకు వెళ్తున్న మాజీ సర్పంచులను పోలీసులు అరెస్ట్ చేయడం సరికాదని జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు.జిల్లా వ్యాప్తంగా మాజీ సర్పంచులను పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామపంచాయతీలకు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి పైసా నిధులు కూడా ఇవ్వలేదన్నారు. రాష్ట్రంలో అసమర్థత పాలన కొనసాగుతోందని, ప్రజాపాలనలో ప్రశ్నిస్తే అరెస్ట్ చేయడమేంటన్నారు. బడా కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించి చిన్న కాంట్రాక్టర్లకు కమీషన్ల కోసం బిల్లులు చెల్లించడం లేదని ఆరోపించారు.

మల్లాపూర్: మాజీ సర్పంచ్‌లను ప్రభుత్వం ముందస్తు అరెస్టు చేయించడం అప్రజాస్వామికమని సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు మైదాసు శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పలువురు మాజీ సర్పంచులను ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహణకు సిద్ధమవుతున్న ప్రభుత్వం పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు భూక్య గోవింద్‌నాయక్, వంతడుపుల నాగరాజు, సయ్యద్ హైదర్ తదితరులు పాల్గొన్నారు.


పోలీస్ స్టేషన్‌లో మాజీ సర్పంచులు

ప్రకృతిసిద్ధమైన రంగులు వాడాలి


విద్యార్థులు తయారుచేసిన రంగులతో అధ్యాపకులు

జగిత్యాల: హోలీ సందర్భంగా ప్రకృతి సిద్ధమైన రంగులను వాడాలని ఎస్‌కేఎన్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ అశోక్ అన్నారు. బుధవారం కళాశాలలో విద్యార్థులు ప్రకృతి సిద్ధమైన రంగులను తయారుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కృత్రిమ రంగులు వాడటం వల్ల అనేకమైన రకాలైన జబ్బులు వచ్చే అవకాశాలున్నాయని, అందరు ప్రకృతిసిద్ధమైన రంగులనే వాడాలన సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు శ్రీనివాస్, సురేందర్ పాల్గొన్నారు.

యాదవ హక్కుల సాధన కోసం పోరాటం

రాయికల్: యాదవ హక్కుల సాధన కోసం పోరాడుతామని అడ్‌హక్ కమిటీ జిల్లా అధ్యక్షుడు గన్నవేని మల్లేశ్‌యాదవ్ పిలుపునిచ్చారు. బుధవారం రాయికల్ మండలం అయోధ్య, ఉప్పుమడుగు గ్రామాల్లో యాదవ సంఘ సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యాదవుల ఐక్యత కోసం కృషి చేయాలని తెలిపారు. జిల్లా కార్యవర్గ సభ్యులు రాజలింగం, మండల ఇన్‌చార్జి కొమురయ్య యాదవ్, నాయకులు మల్లేశ్‌యాదవ్, మల్లేశ్‌యాదశ్, గంగన్న, రాజేందర్, రమేశ్, దుగ్గిళ్ల కుమార్‌యాదవ్ పాల్గొన్నారు.

దేశభక్తి అలవర్చుకోవాలి

జగిత్యాల: విద్యార్థులు దేశభక్తిని అలవర్చుకోవాలని స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర పరిశీలకులు వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం పట్టణంలోని జ్యోతి హైస్కూల్‌లో స్కౌట్స్ అండ్ గైడ్స్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, స్కౌట్స్ అండ్ గైడ్స్ దేశ సేవలో ప్రతి ఒక్కరు పాల్గొనాలని ఆయన సూచించారు. జిల్లా కమిషనర్‌గా హరిచరణ్‌రావు, కార్యదర్శిగా మధుసూదన్, సంయుక్త కార్యదర్శిగా జమునరాణి, గైడ్స్ కమిషనర్‌గా అజిత, వినోద్, కోశాధికారిగా నర్సయ్య, ఆర్గనైజేషన్ కమిషనర్లుగా వెంకటేశ్వర్లు, పద్మజ, ట్రైనింగ్ కమిషనర్‌గా నాగరాజు, సంగీత ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా డీఈవో రాము వారికి అభినందనలు తెలిపారు.

అక్రమ పిరమిడ్ కట్టడాన్ని నిలిపివేయాలి

రాయికల్: మండలంలోని మైతాపూర్ గ్రామ శివారులో వ్యవసాయ భూమిలో నిర్మిస్తున్న అక్రమ పిరమిడ్ కట్టడాన్ని కూల్చివేయాలని, గ్రామంలో అన్యమత ప్రచారం నిలిపివేయాలని కోరుతూ బుధవారం హిందూ చైతన్యవేదిక ఆలయ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు జగదీశ్వర్, గంగమల్లయ్య, మహిపాల్, బేతి సత్యనారాయణ, శ్రీనివాస్,తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి కుటుంబానికి ఆర్థికసాయం

కోరుట్ల: పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు అబ్దుల్ మజీద్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి బుధవారం పీఆర్‌టీయూ టీఎస్ ఆధ్వర్యంలో రూ. లక్ష ఆర్థిక సాయాన్ని సంఘ నాయకులు అందించారు. కార్యక్రమంలో జిల్లా పీఆర్‌టీయూ అధ్యక్ష, కార్యదర్శులు బోయినపెల్లి ఆనందరావు,యాళ్ల అమర్‌నాథ్ రెడ్డి, కోరుట్ల మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు అబ్దుల్ వాజిద్, జక్కులు నవీన్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు సుధీర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్ రంగంలో ఉద్యోగ అవకాశాలు

జగిత్యాలటౌన్: ప్రైవేట్ రంగంలోని పద్మజ సుజుకి ప్రైవేట్ లిమిటెడ్ సంస్థలో సర్వీస్ సలహాదారుడు(20), సేల్స్ ఎక్జిక్యూటివ్ (ఉమెన్) 1, క్యాషియర్ (1),టెక్నీషియన్ (1), ఖాళీల కోసం 15వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి బింగి సత్యమ్మ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు డిగ్రీ,ఐటీఐ ఉత్తీర్ణతతో పాటు ఇంగ్లిష్ భాషలో పరిజ్ఞానం ఉన్న వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి, అర్హత కలిగి ఉన్న నిరుద్యోగ యువతీ,యువకులు ఉదయం 10–30 నుంచి మధ్యాహ్నం 2 గంటల లోపు ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో జరిగే ఇంటర్వ్యూకు హాజరు కావాలని కోరారు.

బీర్‌పూర్ శ్రీ లక్ష్మీనృసింహ ఆలయానికి విరాళం

సారంగాపూర్: బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి ఆలయ అభివృద్ధికి జగిత్యాలకు చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ సతీశ్ కుమార్ దంపతులు బుధవారం రూ. 5 లక్షల విరాళం అందజేశారు. ప్రస్తుతం ఆలయంలో నూతన మండప నిర్మాణం పూర్తి కాగా, ఆలయ గోపురాల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. దేవాదాయశాఖ ద్వారా ప్రభుత్వం రూ.32 లక్షలు వివిధ అభివృద్ధి పనులకు సమకూర్చగా, దాతలు నిర్మాణం కోసం మరిన్ని విరాళాలు అందజేస్తున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మసర్తి రమేశ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చెర్పూరి సుభాష్,ప్రధాన అర్చకులు ఒద్దిపర్తి పెద్ద సంతోష్, చిన్న సంతోష్, మధు కుమార్ తదితరులు పాల్గొన్నారు.


విరాళం అందిస్తున్న డాక్టర్ సతీశ్ కుమార్ దంపతులు

ధర్మపురి పాలకమండలి సభ్యుల నియామకం

ధర్మపురి: ధర్మపురి శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం నూతన పాలక మండలి నియమిస్తూ మకం బుధవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. 13 మంది సభ్యులతో కూడిన కమిటీని ఏర్పాటు చేస్తూ దేవాదాయ,ధర్మాదాయ శాఖా కమిషనర్ శైలజా రామయ్యర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఎదులాపురం మహేందర్, బాదినేని వెంకటేశ్, బొల్లారపు పోచయ్య, గుడ్ల రవీందర్, కొమురెల్లి పవన్‌కుమార్, జక్కు రవీందర్, మందుల మల్లేష్, నేదునూర్ శ్రీధర్, రాపర్తి సాయికిరణ్, సంబెట తిరుపతి, స్తంభంకాడి గణేష్, వొజ్జల సౌజన్య, అవ్వ సుధాకర్‌తో పాటు ఎక్స్ అఫీషియో మెంబర్‌గా నేరెళ్ల శ్రీధరాచార్యులను నియమిస్తూ ప్రభుత్వం లేఖ విడుదల చేసింది.

అలరించిన భక్తి సంగీత విభావరి

ధర్మపురి: బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి నిర్వహించిన భక్తి సంగీత విభావరి భక్తులను అలరింపజేసింది. దేవస్థానంలోని శేషప్ప కళావేదికపై ధర్మపురికి చెందిన సంగనభట్ల నరేందర్, శుభాషిణి, మధుబాపు బృందం భక్తి సంగీత విభావరిని నిర్వహించారు. అదే విధంగా హైదరాబాద్‌కు చెందిన పద్మప్రియ నిర్వహించారు. అనంతరం కళాకారులను దేవస్థానం పక్షాన సన్మానించారు.

వీఆర్‌ఏల ముందస్తు అరెస్టు

మల్యాల: మండలంలోని వీఆర్‌ఏలను బుధవారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి, పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అసెంబ్లీ ముట్టడికి వెళ్తారనే సమాచారం మేరకు అరెస్టు చేశారు. కార్యక్రమం రద్దైందని తెలిపినా పోలీసులు అరెస్టు చేసినట్లు వీఆర్‌ఏలు తెలిపారు. వీఆర్‌ఏలు అలుగునూరి సంజీవ్ కుంబాల రాజయ్య, బోగ కిషన్, సుంకె వెంకటి, మ్యాదరి దేవయ్యలను అదుపులోకి తీసుకున్నారు.

పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు

రాయికల్: పట్టణంలోని జెడ్పీహెచ్ఎస్ బాలుర పాఠశాలలో బుధవారం పదో తరగతి విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన డ్యాన్స్‌లు అందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముందస్తు హోలీ వేడుకలు


రాయికల్: పట్టణంలో బుధవారం వాసవి కిట్టీ పార్టీ ఆధ్వర్యంలో ముందస్తు హోలీ వేడుకలు నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఉత్సాహంగా గడిపారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

రాయికల్: మండలంలోని రామాజీపేటలో ఓ ఇంట్లో అక్రమంగా నిలువ చేసిన 12 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని బుధవారం పట్టుకున్నట్లు సివిల్ సప్లై డీటీ వరప్రసాద్, ఎఫ్ఐ రాజేంద్రప్రసాద్, ఆర్ఐ పద్మయ్య తెలిపారు. వీటిని స్థానిక డీలర్‌కు అప్పగించినట్లు తెలిపారు.

పశుగ్రాసం కట్టలు దగ్ధం

రాయికల్: పట్టణంలోని శివాలయంలో 450 కట్టల పశుగ్రాసం బుధవారం ప్రమాదవశాత్తు నిప్పంటుకుని పూర్తిగా కాలి బూడిదైంది. మంటలు ఆర్పేందుకు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించినప్పటికీ సకాలంలో లేకపోవడంతో స్పందించిన యువకులు, స్థానికులు మంటలు ఆర్పారు. సుమారు రూ.70 వేల నష్టం వాటిల్లిందని శివసైనికులు ఆవేదన వ్యక్తం చేశారు.

కార్యదర్శి సంతకం ఫోర్జరీ చేసిన వ్యక్తిపై కేసు

కథలాపూర్: మండలంలోని ఇప్పపల్లి గ్రామ కార్యదర్శి సంతకాన్ని ఫోర్జరీ చేసిన అదే గ్రామానికి యాగండ్ల చిన్నరాజంపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ బుధవారం తెలిపారు. యాగండ్ల చిన్నరాజం ఓనర్‌షిప్ సర్టిఫికెట్ తయారుచేసి గ్రామపంచాయతీ కార్యదర్శి సంతకాన్ని ఫోర్జరీ చేసినట్లు కార్యదర్శి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడిగా సురేశ్

జగిత్యాల: కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ జిల్లా అధ్యక్షునిగా నాయిని సురేశ్‌ను నియమిస్తూ కాంగ్రెస్ పార్టీ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు నియామక పత్రాన్ని బుధవారం కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి నర్సింగరావు అందజేశారు. ఆయన నియామకం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

టీజీవో అసోసియేషన్ సంయుక్త కార్యదర్శిగా శ్రీనివాస్

పెగడపల్లి: తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (సెంట్రల్ అసోసియేషన్ హైదరాబాద్) రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా పెగడపల్లి ఎంపీడీవో ఎడబోయిన శ్రీనివాస్‌రెడ్డి ఎన్నికయ్యారు. బుధవారం హైదరాబాద్‌లో జరిగిన ఎన్నికల్లో శ్రీనివాస్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శ్రీనివాస్‌రెడ్డి నియామకం పట్ల మండల, జిల్లా సంఘం బాధ్యులు హర్షం వ్యక్తం చేశారు.

కబ్జా కోరుకు వత్తాసు పలకడం సరికాదు

మల్లాపూర్: పేద రైతుల భూమిని బీఆర్ఎస్ నాయకుడు దేవ మల్లయ్య(డీలర్) ఆక్రమించుకుని వారి పొట్టను కొట్టాడని ప్యాక్స్ వైస్‌చైర్మన్ గొండ రాజేందర్ అన్నారు. బుధవారం మల్లాపూర్‌లో మాట్లాడారు. ప్రభుత్వభూమిని కబ్జా చేసి గొర్రెల ఫాంను అక్రమంగా నిర్మించాడని దుయ్యబట్టారు. ఇదే కాకుండా డబుల్ బెడ్ రూం ఇళ్లకి సంబంధించి కాంట్రాక్టరుగా వ్యవహరించి ప్రతి లబ్ధిదారుడి నుంచి రూ.1.50లక్షలను వసూలు చేశాడని ఆరోపించారు. దేవ మల్లయ్య అక్రమాలను అడ్డుకోవాల్సిన మాజీ ఎమ్మెల్యే అతడికి వత్తాసు పలికి తన స్థాయిని తగ్గించుకోవద్దని హితవు పలికారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వృద్ధురాలు అదృశ్యం

కథలాపూర్: మండలంలోని చింతకుంట గ్రామానికి చెందిన బద్దినపెల్లి బావాయి(56) అనే వృద్ధురాలు అదృశ్యం కావడంతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ బుధవారం తెలిపారు. బావాయి ఈనెల 11న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లలో వాకబు చేసిన సమాచారం లేదన్నారు. దీంతో బావాయి అదృశ్యమైనట్లు ఆమె భర్త శంకర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. శంకర్ ఫిర్యాదు మేరకు బావాయి అదృశ్యమైనట్లు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గ్రూప్–1 పరీక్షలో గాలిపెల్లి స్నేహ సత్తా

పెగడపల్లి: గ్రూప్–1 పరీక్షలో బతికపల్లి గ్రామానికి చెందిన గాలిపల్లి స్నేహ సత్తా చాటింది. ఈ నెల 10న వెలువడిన గ్రూప్–1 ఫలితాల్లో 517 మార్కులు సాధించి 485వ ర్యాంకు సాధించింది. స్థానికంగా గోల్డ్‌స్మిత్‌గా పని చేస్తున్న గాలిపల్లి రాజమౌళి-అనూష దంపతులకు స్నేహ, శ్వేత ఇద్దరు కూతుళ్లు. ఇప్పటికే సీఏ పూర్తి చేసిన పెద్ద కూతురు స్నేహ ఇన్‌కమ్‌ట్యాక్స్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగం చేస్తోంది. ఉద్యోగం చేస్తునే ఏలాంటి కోచింగ్ లేకుండా గ్రూపు- 1కు సన్నద్ధమైంది. మొదటి ప్రయత్నంలోనే గ్రూప్–1లో 517 మార్కులతో 485వ ర్యాంక్ సాధించింది. స్నేహ ఉత్తమ ర్యాంక్ సాధించడంతో ఆమె కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు లేకుండా చూస్తాం

కథలాపూర్: యాసంగి సీజన్‌లో పండించిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా చూస్తామని కథలాపూర్ ఏఎంసీ చైర్మన్ పూండ్ర నారాయణరెడ్డి అన్నారు. కథలాపూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పాలకవర్గ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మార్కెట్ అభివృద్ధికి తీసుకోవాల్సిన వాటిపై చర్చించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ఉన్నాయని, ఏర్పాట్లు చేస్తామన్నారు. ఈ సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ పులి శిరీషా, డైరెక్టర్లు ఎం.డీ హఫీజ్, కారపు గంగాధర్, వాకిటి రాజారెడ్డి, విజయ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



మల్లాపూర్: మండల కేంద్రంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో శ్రీ చౌడాలమ్మ అమ్మవారికి బుధవారం మహిళలు బోనాలు చేశారు. పూజారులు పట్నాలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బోనాల ఊరేగింపులో ఒగ్గుడోలు కళాకారుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. గ్రామస్తులు భారీగా తరలివచ్చి చౌడాలమ్మకి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో యాదవ సంఘం నాయకులు, సభ్యులు, గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.



కథలాపూర్: మండలంలోని సిరికొండలో మడేలేశ్వరస్వామి బోనాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. రజక సంఘం ఆధ్వర్యంలో బోనాలు చేశారు. గ్రామం నుంచి ఆలయం వరకు భక్తులు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి స్వామివారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.